Postal RNI No. NG/049/2022-2024

Name ____________________

Address ____________________

FROM: Akshara Kalam Telugu Daily

Regd Office :H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)

# అక్షర కలం

తెలుగు దినపత్రిక




నల్లగొండ సంపుటి:17 సంచిక :159 16-07-2025 బుధవారము ఎడిటర్: పిట్టల రామకృష్ణ పేజీలు : 12 వెల: రూ.1.00

## భోజనం పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి




నల్గొండ : జిల్లాలోని అన్ని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న భోజనం విషయంలో సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. మంగళవారం ఆమె నల్గొండ జిల్లా, గుర్రంపోడు కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వంటగదిని, డైనింగ్, పాఠశాల ఆవరణలో పరిశుభ్రతను పరిశీలించారు. పదవ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో గణితం పై ప్రశ్నలను అడిగి విద్యార్థులకు మ్యాథమెటిక్స్ పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు అందించే భోజనం పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కేజీబీవీ ప్రత్యేక అధికారిని ఆదేశించారు. భోజనం, పారిశుధ్య లోపం వల్ల విద్యార్థులకు ఇబ్బందులు కలిగినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భోజనం,పారిశుధ్యం ఈ రెండు అంశాలపై పూర్తి శ్రద్ధ నిబద్ధతతో పనిచేయాలని, వంట గదులు, డైనింగ్ తో పాటు, పాఠశాల ఆవరణ మొత్తం శుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ భవిత కేంద్రాన్ని సందర్శించి ఇటీవల ప్రభుత్వం భవిత కేంద్రాలకు సరఫరా చేసిన ఆట వస్తువులు, ఇతర సామాగ్రిని పరిశీలించి సంబంధిత స్టాక్ రిజిస్టర్ లో కేంద్రం ఇన్చార్జిగా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం జిల్లా కలెక్టర్ గుర్రంపోడు తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ భారతి పై వచ్చిన దరఖాస్తుల వివరాలను పరిశీలించారు. భూ భారతి దరఖాస్తులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని చెప్పారు. దేవరకొండ ఆర్ డి ఓ రమణారెడ్డి, గుర్రంపోడు మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి అనంతరెడ్డి, డీఈఓ బిక్షపతి, గుర్రంపోడు తహసిల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ యాదగిరి, డిఈ పరమేష్, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ ప్రత్యేక అధికారి విజయశ్రీ, ఇతర అధికారులు ఉన్నారు.

## సమాజంలో మీడియా పాత్ర ప్రత్యేకమైనది



వికారాబాద్, : సమాజంలో మీడియా పాత్ర ప్రత్యేకమైనదని, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకొచ్చే బాధ్యత మీడియాపై ఉందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్ లో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన వార్త ల్యాబ్ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో మీడియా రంగం రోజురోజుకు ముందుకు సాగుతుందని, పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, యూట్యూబ్ ఛానల్, తదితర రంగాల్లో పోటీ ప్రపంచం నెలకొందన్నారు. ప్రభుత్వం చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో తెలపాల్సిన బాధ్యత మీడియాకు ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైని కలెక్టర్ హర్ష చౌదరి, పి ఐ బి అధికారి శృతి, తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు ఆదేశాల మేరకు త్వరలో పంచాయతీ ఎన్నికలు



బిక్కనూరు, : హైకోర్టు ఆదేశాల మేరకు త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. మంగళవారం కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలంలో ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక అభివృద్ధి కుంటు పడుతుందని చెప్పారు. గ్రామాల అభివృద్ధి పంచాయతీ కార్యదర్శుల పై పడడంతో వారు సరైన అభివృద్ధి చేయలేకపోతున్నారని తెలిపారు. కేంద్రం నుండి సరైన నిధులు రాకపోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ప్రస్తుతం తమపై భారం పడుతుందని చెప్పారు. అయినప్పటికీ ఎన్ని ఇబ్బందులైనా కాంట్రాక్టర్లకు బిల్లు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకోసం ఒక కమిటీని సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఉచిత ఇసుక ప్రభుత్వం సరఫరా చేస్తుందని తెలిపారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ ఒకపక్క సంక్షేమం, మరోవక్క అభివృద్ధితో పాటు కాంట్రాక్టర్లకు చెల్లించవలసిన బిల్లులు చెల్లిస్తూనే ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. వారికి బిల్లులు రాగానే తిరిగి సంఘాలకు డబ్బులు చెల్లించవలసి ఉంటుందని ఆమె చెప్పారు. ఈసమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమ్ రెడ్డి పలువురు నాయకులు ఉన్నారు.

## లోయలో పడిన టెంపో: ఐదుగురు మృతి



న్యూఢిల్లీ: జమ్మూ కాశ్మీర్‌లోని దోడ జిల్లాలోమంగళవారం ఉదయం టెంపో ట్రావెలర్ లోతైన లోయలో పడిపోవడంతో కనీసం ఐదుగురు మరణించగా, మరో 19 మంది గాయపడ్డారని, వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని డీసీ దోడా హర్విందర్ సింగ్ హెచ్‌టికి వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన వారిలో ఐదేళ్ల బాలిక కూడా ఉందని, వాహనం స్టీరింగ్‌లో యాంత్రిక సమస్య కారణంగా ప్రమాదం జరిగిందని ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. వివరణాత్మక దర్యాప్తు తర్వాత ఖచ్చితమైన కారణం తెలుస్తుంది. కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ప్రమాద విషయాన్ని తెలుసుకుని తక్షణమే సహాయక చర్యలు చేపట్టామని ఎక్స్ లో పేర్కొన్నారు.దోడ నగరానికి 20 నుండి 25 కి.మీ దూరంలో ఉన్న భర్ట్ గ్రామం సమీపంలో జరిగిన ప్రైవేట్ టెంపో రోడ్డు ప్రమాదం గురించి సమాచారం అందుకున్న దోడ డిసి హర్విందర్ సింగ్ తో మాట్లాడానని జితేంద్ర సింగ్ ఎక్స్ లో రాశారు. సాధ్యమైనంత సహాయం,వైద్య సహాయం అందించబడుతున్నాయి. డిసి వ్యక్తిగతంగా మొత్తం ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. మంగళవారం దోడ-బారత్ రోడ్డులోని పోండా సమీపంలో ఒక టెంపో ట్రావెలర్ రోడ్డు అదుపుతప్పి లోతైన లోయలో పడిపోయిందని ఒక పోలీసు అధికారి తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రమాదం జరిగిన సమయంలో వాహనంలో 23 మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. స్థానిక పోలీసులు, స్వచ్ఛంద సేవకులు వెంటనే సహాయక చర్యలను ప్రారంభించారు. అధికారులు బాధితులను తిరిగి పొందడంలో, అత్యవసర వైద్య సహాయం అందించడంలో సహాయపడటానికి సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

## మాజీ ఈఎన్‌సీ నివాసంలో ఏసీబీ రైడ్స్



హైదరాబాద్, :తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖకు ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)గా సేవలందించిన విశ్రాంత అధికారి మురళీధర్ రావును ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనపై నమోదైన కేసులో, అసలు ఆదాయానికి విరుద్ధంగా భారీగా ఆస్తులు సొంతం చేసుకున్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. ఈ కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు హైదరాబాద్, కరీంనగర్, జహీరాబాద్ ప్రాంతాల్లో మురళీధర్‌రావు నివాసం, బంధువులు మరియు సన్నిహితుల ఇళ్లలో విస్తృతంగా సోదాలు నిర్వహిస్తున్నారు. మురళీధర్ రావు అప్పట్లో ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో నీటి పారుదల శాఖలో కీలక స్థానంలో కొనసాగుతూ అనేక ప్రాజెక్టుల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. అయితే, ఈ ప్రాజెక్టుల్లో భారీ అవినీతి జరిగిందన్న ఆరోపణలు వెలుగుచూస్తున్నాయి. ముఖ్యంగా కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, మేడిగడ్డ బ్యారేజ్ లాంటి భారీ ప్రాజెక్టుల్లో ఉన్న అవకతవకలపై ప్రస్తుత ప్రభుత్వం తీవ్రంగా స్పందిస్తోంది. ఈ ప్రాజెక్టుల్లో జరిగిన అక్రమాలపై ప్రభుత్వ స్థాయిలో విచారణలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు మురళీధర్ రావు ఇప్పటికే హాజరయ్యారు. అధికారిక పత్రాల ప్రకారం, ఆయనే ఈ ప్రాజెక్టులకు సంబంధించి పలు కీలక ఆదేశాలు జారీ చేసినవారిలో ఒకరు. మురళీధర్ రావు నిజానికి ఉమ్మడి రాష్ట్రం హయాంలోనే పదవీ విరమణ పొందిన వారు. అయినా ఆయన సేవలు అవసరమని పేర్కొంటూ అప్పటి పాలకులు పదే పదే పదవీకాలాన్ని పొడిగిస్తూ 13 సంవత్సరాల వరకు కొనసాగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా కొద్ది కాలం పాటు ఆయన పదవిలో కొనసాగారు. ఇటీవల మేడిగడ్డ అవకతవకలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నివేదిక సమర్పించింది. అందులో మురళీధర్ రావుతో పాటు మొత్తం 17 మంది అధికారులపై క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేయబడింది. దీనితో సంబంధంగా ప్రభుత్వం ఆయన్ను పదవి నుంచి తొలగించింది. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అవినీతిపై నిష్పాక్షికంగా దర్యాప్తు జరుపుతుందన్న సంకేతాలు ఈ చర్యల ద్వారా స్పష్టమవుతున్నాయి. ఇరిగేషన్ శాఖలో గతంలో జరిగిన అవకతవకలు ప్రస్తుతం తెలంగాణలో రాజకీయం, పరిపాలన రెండింటినీ ప్రభావితం చేస్తున్నాయి. రాష్ట్ర నిధులను దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తప్పవని ప్రభుత్వం ఇప్పటికే హెచ్చరించింది. ఏసీబీ, విజిలెన్స్ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, ఇలాంటి అక్రమాలకు పాల్పడిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాయి. మురళీధర్ రావుపై విచారణ కొనసాగుతుండగా, భవిష్యత్‌లో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్



హైదరాబాద్: ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇవాళ (మంగళవారం) ఐకార్ బయోలజిక్స్ కొత్త యూనిట్ కి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. దేశంలోనే 33 శాతం వ్యాక్సిన్స్ , బల్క్ డ్రగ్స్‌లో 43 శాతం ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతున్నాయని నొక్కిచెప్పారు. కోవిడ్ సమయంలో జీనోమ్ వ్యాలీ నుంచే ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్‌ను ఎగుమతి చేసిన ఘనత ఇక్కడి పారిశ్రామికవేత్తలదని ఉద్ఘాటించారు సీఎం రేవంత్‌రెడ్డి.ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక విధానాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగానే ప్రభుత్వాల నిర్ణయాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం మరింత సరళమైన విధానాలతో ముందుకెళ్తుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ డేటా సిటీగా మారనుందని ఉద్ఘాటించారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 3లక్షల 28 వేల కోట్లు పెట్టుబడులు సాధించామని స్పష్టం చేశారు. ప్రపంచ దేశాలతో పోటీ పడాలని, అధునాతన విధానాలను తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే పదేళ్లలో తెలంగాణను వన్ ట్రిలియన్ ఎకానమీగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని నొక్కిచెప్పారు. ఇందుకు జీనోమ్ వ్యాలీ పారిశ్రామికవేత్తల సహకారం ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

## చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో జై శంకర్ భేటీ



భారత విదేశాంగ మంత్రి జైశంకర్ మంగళవారం చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ ను కలిశారు. ఇటీవలి కాలంలో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో జరిగిన పరిణామాల గురించి ఆయనకు వివరించారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తరఫున ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయాన్ని జైశంకర్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. 2020లో గల్వాన్ ఘటనతో ఇరుదేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తిన విషయం తెలిసిందే. ఇది జరిగిన తర్వాత భారత విదేశాంగశాఖ మంత్రి చైనాలో పర్యటించడం ఇదే మొదటిసారి. 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత తొలిసారి షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు కోసం జైశంకర్ చైనాలో పర్యటిస్తున్నారు. చైనా ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్ , విదేశాంగమంత్రి వాంగ్ యీతో భేటీ అయిన ఆయన, చైనా-భారత్ సంబంధాలు క్రమంగా బలపడుతున్నట్లు వివరించారు. ద్వైపాక్షిక సంబంధాలు, సహకారాలను మరింత బలోపేతం చేసుకోవడం వల్ల ఇరుదేశాలతో పాటు ప్రపంచానికి కూడా ప్రయోజనకరమని అభిప్రాయపడ్డారు. చైనా వైపు నుంచి ప్రవహించే సరిహద్దు నదుల్లో నీటికి సంబంధించిన సమాచారాన్ని అందించడంపై జైశంకర్ వారితో చర్చించారు. "సరిహద్దు సమస్యలను పరిష్కరించడం, ప్రజల రాకపోకలను సాధారణీకరించడం, నిర్బంధ వాణిజ్య చర్చలను, అడ్డంకులను నివారించడం మా బాధ్యత. పరస్పర గౌరవం, ఆసక్తులు, సున్నితత్వం ఆధారంగా ద్వైపాక్షిక సంబంధాలు సానుకూల పథంలో అభివృద్ధి చెందుతాయని ఆశిస్తున్నాము. రేపు టియాంజియన్ లో జరిగే ఎస్ సీఓ విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరుకావడానికి ఎదురుచూస్తున్నాము. మంచి ఫలితాలు, నిర్ణయాలను నిర్ధరించడానికి భారత్ కట్టుబడి ఉంది" అని జైశంకర్ అన్నారు. సింగపూర్ పర్యటన ముగించుకున్న జైశంకర్ ఎస్ సీఓ సమావేశంలో పాల్గొనేందుకు చైనా వెళ్లారు. ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య విమానాల పునరుద్ధరణ సహా భారత్ - పాక్ ఉద్రిక్తతలు, దలైలామా వారసత్వంపై ఇటీవల చెలరేగిన వివాదం మొదలైన అంశాల గురించి ఆయన చర్చించే అవకాశం ఉందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. జూన్ నెలలో భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ లు చైనాలో పర్యటించారు. అప్పుడు రాజనాథ్ సింగ్ చైనాలోని క్వింగ్డావోలో జరిగిన షాంఘై సహకార సంస్థ సభ్యదేశాల రక్షణ మంత్రిత్వస్థాయి సదస్సుకు హాజరయ్యారు. ఇప్పుడు విదేశాంగ మంత్రి జైశంకర్ చైనాలో పర్యటిస్తున్నారు. మరోవైపు దశాబ్దాలుగా ఉన్న సరిహద్దు వివాదాన్ని పరిష్కరించే లక్ష్యంతో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ వచ్చే నెల భారత్ కు రానున్నారు. ఆయన నేరుగా భారత జాతీయ భద్రతా సలహా దారు అజిత్ ధోబాల్ తో భేటీ కానున్నారు. 2020లో గల్వాన్ లోయ వద్ద భారత్ , చైనా సైనికుల మధ్య ఘర్షణ జరిగింది. దీనితో ఇరువైపులా చాలా మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. దీనితో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగి, ద్వైపాక్షిక సంబంధాలు దారుణంగా దెబ్బతిన్నాయి. అయితే గతేడాది అక్టోబర్ లో రష్యాలోని కజాన్ లో భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ భేటీ అయ్యారు. సరిహద్దు సమస్యల పరిష్కారం గురించి చర్చించారు. ఇదే క్రమంలో ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పురోగతికి నిదర్శనంగా, దాదాపు 5 ఏళ్ల తరువాత కైలాస మానస సరోవర్ యాత్ర పునఃప్రారంభం అయ్యింది.

## భూమి పైకి శుభాంశు శుక్లా..



న్యూఢిల్లీ: యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఇటీవల ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కు వెళ్లిన భారత ఆస్ట్రోనాట్ శుభాంశు శుక్లా బృందం తాజాగా భూమిపైకి దిగింది. శుభాంశుతో పాటు మరో ముగ్గురు వ్యోమగాములు భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు కాలిఫోర్నియా సముద్ర తీరంలో దిగారు. శుభాంశు శుక్లా బృందం జూన్ 25న అమెరికాలోని నాసా నాసా కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఫాల్కన్-9 రాకెట్‌లో అంతరిక్షంలోకి వెళ్లిన సంగతి తెలిసిందే. 28 గంటల ప్రయాణం తర్వాత వారు ISS లోకి చేరుకున్నారు. అందులో శుక్లా నేతృత్వంలోని ఈ టీమ్ మొత్తం 60 రకాల శాస్త్రీయ ప్రయోగాలు నిర్వహించింది. వీటిలో శుక్లా ఒక్కరే స్వయంగా 7 ప్రయోగాలు నిర్వహించడం విశేషం. శుభాంశుతో సహా నలుగురు వ్యోమగాములు ISSలో 18 రోజులు గడిపారు. అంతరిక్షంలో జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టం గురించి శుభాంశు శుక్లా అధ్యయనం చేశారు. అంతేకాదు మానవ జీర్ణవ్యవస్థ అంతరిక్షంలో ఎలా పనిచేస్తుందనే దానిపై ఆయన భారత విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఓ వీడియోను కూడా రూపొందించారు. అలాగే ఈ నలుగురు వ్యోమగాములు తమ మానసిక స్థితిగతులపై కూడా ప్రయోగాలు చేశారు. ఓ ఫ్లోటింగ్ వాటర్ బబుల్‌ను తయారుచేసి అందులో గడిపారు. ఇది తన జీవితంలో అద్భుతమైన అనుభవమని శుభాంశు తెలిపారు. కిటికీ పక్కన కూర్చుని కిందకి చూడటం అనేది నా జీవితంలోకెల్లా అత్యంత అద్భుతమైన అనుభూతని చెప్పారు. అంతేకాదు స్పేస్‌లో వ్యవసాయం దిశగా కూడా ఈ ఆస్ట్రోనాట్స్‌పలు పరీక్షలు నిర్వహించారు. శుభంశు శుక్లా టీమ్ ఐఎస్ఎస్‌లో 18 రోజులు గడిపి భూమి చట్టూ 76 లక్షల మైళ్లకు పైగా ప్రయాణం చేసింది. మొత్తం 288 సార్లు భూప్రదక్షిణలు చేసింది. ఇదిలాఉండగా అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లిన తొలి భారతీయుడిగా శుభాంశు శుక్లా చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. ఆయన భూమిపైకి తిరుగు ప్రయాణమయ్యే ముందు ఓ వీడ్కోలు ప్రసంగం చేశారు. 41 ఏళ్ల క్రితం అంతరిక్షంలోకి వెళ్లిన తొలి భారతీయుడు రాకేశ్ శర్మ.. అక్కడి నుంచి భారత్ ఎలా కనిపిస్తుందో వర్ణించిన వైనాన్ని శుభాంశు గుర్తుకుచేసుకున్నారు. " నేటి భారత్ సగర్వంగా తలెత్తుకుని సాగుతోంది. ఈరోజు నా దేశం మిగతా ప్రపంచమంతటి కంటే మిన్నగా (సారే జహా సే అచ్ఛా) కనిపిస్తోందని చెప్పగలను అంటూ అప్పట్లో రాకేశ్ శర్మ చేసిన వ్యాఖ్యలను శుభాంశు కూడా వ్యాఖ్యానించారు.

# మహిళలు విద్యావంతులైనప్పుడు మాత్రమే జనాభా పెరుగుదల అదుపు లోకి వస్తుంది...

మహిళలు విద్యావంతులైనప్పుడు మాత్రమే జనాభా పెరుగుదల అదుపు లోకి వస్తుంది. మహిళలు నిరక్షరాస్యులుగా ఉండటం వల్ల అణిచివేతకు గురౌతూ జనాభా నియంత్రణను కట్టడి చేయలేకపోతున్నారు. వారు విద్యావంతులైతేనే జనాభా నియంత్రణ సాధ్యమవుతుంది' అని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ 2023 జనవరిలో బీహార్ రాష్ట్రంలో సమాధాన్ యాత్ర పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్న సమయంలో వ్యాఖ్యానించడం మహిళల సాధికారతపై ఆయనకున్న అంకిత భావాన్ని తెలియజేస్తుంది. తాజాగా బీహార్‌లోని మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 35 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని నితీశ్ కుమార్ నిర్ణయించడం మహిళల కోటా విషయంలో ఆదర్శబాటలో ముందడుగు వేసినట్టు స్పష్టమవుతోంది.అయితే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది చివర్లో జరగనున్నందున మహిళల ఓట్లను గుత్తగోలుగా కొల్లగొట్టడానికి ఈ ఎత్తుగడ అని విపక్షాల నుంచి విమర్శలు వస్తున్నా ఈ నిర్ణయం మహిళల జీవితాల్లో ప్రగతిదాయకమైన మార్పు తీసుకు వస్తుందని చెప్పవచ్చు. మద్యపాన నిషేధం, కులగణన వంటి బృహత్తర ప్రణాళికలను అమలులోకి తెచ్చి దేశం మొత్తం మీద ప్రత్యేకతను సాధించుకున్న బీహార్ రాష్ట్రం మరో సంచలనాత్మక నిర్ణయం తీసుకుంది. బీహార్‌లో శాశ్వత నివాసితులుగా ఉన్న స్థానిక మహిళలకే కులాలకు అతీతంగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో (%దీఅప్త్రఖతీ షీఎవఅ తీవంవతీజుఅశీఅ%) అన్ని విభాగాల పోస్టులకు ఈ ప్రత్యేక రిజర్వేషన్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. స్థానికత అంటే కనీసం మూడేళ్ల నుంచైనా బీహార్‌లో ఉంటున్నట్టు ఆధారాలు చూపించాలి. స్వంతగా ఇల్లు లేదా భూమి ఉండాలి. మహిళలకైతే రాష్ట్రానికి చెందిన వ్యక్తితో వివాహం జరిగి ఉండాలి. ఈ నిర్ణయం బీహార్ రాష్ట్రేతర మహిళా ఉద్యోగులపై ఎలాంటి నష్టం కలిగించదు. ఎందుకంటే ఇదివరకే వీరు 35 శాతం రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగాలు పొందారు. ఇప్పుడు నిబంధన ప్రకారం బీహార్ నివాసులు కాని మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అర్హత ఉండదు.2016 లో కూడా నితీశ్ ప్రభుత్వం మహిళలకు 35 శాతం రిజర్వేషన్ విధానాన్ని తీసుకొచ్చింది. అప్పుడు ఆర్‌జెడి, కాంగ్రెస్ మిత్రపక్షాలతో జెడి(యు) అధికార కూటమికి కూడా ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ ఉండేవారు. అప్పుడు మహిళలకు 35 శాతం రిజర్వేషన్ ముఖ్యంగా పోలీస్ రిక్రూట్‌మెంట్, కో ఆపరేటివ్ సొసైటీలు తదితర కొన్ని రంగాలకే ఈ రిజర్వేషన్ అమలు చేశారు. అంతకు ముందు 2013లో పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ అమలుకాగా, కోఆపరేటివ్ సొసైటీల్లో 50 శాతం వరకు మహిళలకు రిజర్వేషన్ కల్పించి మహిళా పక్షపాతిగా నితీశ్ పేరు తెచ్చుకున్నారు. బాలికల విద్యకు సంబంధించి ముఖ్యమంత్రి బాలికా సైకిల్ యోజన (నగదు పంపిణీ), ముఖ్యమంత్రి కన్యా ఉద్ధవ్ యోజన (విద్యార్థినులైన బాలికలకు ఆర్థిక సాయం) అమలు చేశారు.2016 లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్‌లో 'స్థానికులు' అన్న పరిమితి విధించకపోవడం విమర్శలకు దారి తీసింది. కానీ ఇప్పుడు 'స్థానికత' తప్పనిసరి చేయడంతో రాష్ట్రంలోని మహిళలకే ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశం లభించింది. దేశంలోనే మూడవ అత్యధిక జనాభా కలిగిన బీహార్‌లో 2001లో 8.3 కోట్ల మంది ఉండగా, 2011 నాటికి 10.41 కోట్ల మంది ఉన్నారు. వీరిలో పురుషులు 5,42.78,157 కాగా, మహిళలు 4,98,21, 295 మంది వరకు ఉన్నారు. ఈ దశాబ్ద కాలంలో జనాభా పెరుగుదల 28.43 శాతం వరకు కనిపించింది. జనాభా వేగంగా పెరుగుతుండడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. నిరుద్యోగం, ఆర్థిక అసమానత, పరిమిత వనరులు, ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలు, విద్యావకాశాలు ఇవన్నీ సవాలుగా నిలిచాయి. 2023 కులగణన ప్రకారం బీహార్‌లో అక్షరాస్యత 79.8 శాతం వరకు పెరిగింది. 2011లో 61.18 శాతం మాత్రమే ఉండేది. అంటే 18 శాతం దశాబ్ద కాలంలోపెరిగింది.రాష్ట్ర జనాభాలో 1.57 శాతం కన్నా తక్కువ మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నారు. గత నెల వరకు పోలీస్ శాఖలో 36 వేల మంది మహిళలు పని చేస్తున్నారు. 2007 నుంచి 2.5 లక్షల కన్నా ఎక్కువ మంది మహిళా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. మహిళా సాధికారతే ప్రధాన లక్షంగా నితీశ్ ప్రభుత్వం పాలనా సంస్థల్లో కూడా మహిళలకు పట్టం కట్టింది. పంచాయతీల్లో గత కొన్నేళ్లుగా మహిళలకు 50 శాతం కోటా కల్పించింది. మహిళా స్వయం సహాయక సంఘాలు కూడా 10 లక్షల కన్నా ఎక్కువే ఉన్నాయి.ఇక వివిధ రాష్ట్రాల్లో మహిళల ఉద్యోగ కోటాను పరిశీలిస్తే 2006లో ఉత్తరాఖండ్ ప్రభుత్వం రాష్ట్రంలో మహిళా అభ్యర్థులకు 30% సమాంతర రిజర్వేషన్ కల్పించింది. ఆ రాష్ట్రంలో నివసించే స్థానిక మహిళలకే వర్తింపచేసింది. 2022 లో కర్ణాటక ప్రభుత్వం అన్ని విభాగాల్లో అవుట్ సోర్స్ మహిళా ఉద్యోగులకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసింది. డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హౌస్ కీపింగ్ సిబ్బంది, ఇతర గ్రూప్‌డి ఉద్యోగులు, డ్రైవర్లను అవుట్ సోర్సింగ్ ద్వారా నియమించింది. స్వయం ప్రతిపత్తి సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ఈ రిజర్వేషన్ వర్తించేలా చర్యలు తీసుకుంది. 2022లో మహిళా దినోత్సవం సందర్భంగా త్రిపుర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో , ఉన్నత విద్యాసంస్థల్లో మహిళలందరికీ 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నిర్ణయించింది. 2020 లో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం పంజాబ్ సివిల్ సర్వీస్, బోర్డులు, కార్పొరేషన్లకు ప్రత్యక్ష నియామకాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను ఆమోదించింది.

# సామాన్యులకు గుడ్ న్యూస్..



న్యూఢిల్లీ: దేశంలో ద్రవ్యోల్బణంతగ్గుతోంది. దీని ప్రభావం సామాన్య ప్రజలకు ఊరటను కలిగిస్తోంది. నేడు కేంద్ర ప్రభుత్వం టోకు ధరల సూచీ గణాంకాలను విడుదల చేసింది. జూన్ నెలలో భౌ×20 నెలల కనిష్ఠ స్థాయి 0.13 శాతానికి చేరిందని, ఇది అక్టోబర్ 2023 తర్వాత అత్యల్ప స్థాయి అని తెలిపింది. మే నెలలో టోకు ధరల సూచీ 0.39 శాతంగా ఉంది. అంటే మొత్తంగా దేశంలో ద్రవ్యోల్బణం వేగంగా తగ్గింది. క్రూడ్ పెట్రోలియం, సహజ వాయువు, ఖనిజ తైలం, బేసిక్ మెటల్స్ తయారీ సరసమైన ధరలకు అందుబాటులోకి రావడం వల్ల ఈ క్షీణత సంభవించిందని ప్రభుత్వం తెలిపింది. అంతేకాక, ఆహార పదార్థాల ధరలు కూడా తగ్గాయని పేర్కొంది.జూన్ నెలలో కూరగాయల ద్రవ్యోల్బణం 22.65 శాతానికి తగ్గింది. ఇది మే నెలలో 21.62 శాతంగా ఉంది. ఉల్లిపాయల ద్రవ్యోల్బణం 33.49 శాతంగా ఉంది. ఇది మే నెలలో 14.41 శాతంగా ఉంది. ఈ సమయంలో బంగాళదుంపల ధరలు 32.67 శాతం వరకు గణనీయంగా తగ్గాయి. మే నెలలో ఇది 29.42 శాతం తక్కువగా ఉంది. పప్పు ధరలు కూడా 22.65 శాతం వరకు తగ్గాయి,. మే నెలలో ఇది 10.41 శాతం తగ్గింది.ధాన్యాల ద్రవ్యోల్బణం కూడా 3.75 శాతం తగ్గింది. మే నెలలో ఇది 2.56 శాతంగా ఉంది. మొత్తంగా వంటగది సామగ్రి సరసమైన ధరలకు అందుబాటులోకి రావడంతో సామాన్య ప్రజలకు ఊరట లభించింది. ఈ సమయంలో ఇంధనం, విద్యుత్ ధరలు కూడా నియంత్రణలో ఉన్నాయి. జూన్ నెలలో ఈ విభాగంలో ద్రవ్యోల్బణం 2.65 శాతంగా ఉంది. ఇది మే నెలలో 22.27 శాతంగా ఉంది. అంటే ఇంధనం, విద్యుత్ ధరలలో కూడా గణనీయమైన తగ్గుదల కనిపించింది. అదే సమయంలో తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 1.97 శాతంగా ఉంది. ఇది %భౌ×% బాస్కెట్‌లో 60 శాతం వాటాను కలిగి ఉంది. ప్రాథమిక వస్తువుల (ప్రైమరీ ఆర్టికల్స్) ద్రవ్యోల్బణం జూన్ నెలలో 3.38 శాతం వరకు తగ్గింది. మే నెలలో ఇది 2.02 శాతం తగ్గింది.

## ఐదుగురు మావోయిస్టుల లొంగుబాటు

ములుగు:వివిధ హోదాల్లో సీపీఐ(మావోయిస్టు)లో పని చేస్తున్న ఐదుగురు మావోయిస్టు సభ్యులు ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్.పి సమక్షంలో లొంగిపోయారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. లొంగిపోయినవారిలో ఒకరు ఏసీఏం హోదాలో, నలుగురు పార్టీ సభ్యులుగా ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు తక్షణంగా ఒక్కొక్కరికి రూ. 25వేల చొప్పున మొత్తం రూ. 1.25లక్షలు అందజేశారు. మిగిలిన మొత్తం రూ. 6,75,000ను ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు అందిన వెంటనే వారి ఖాతాల్లో చెక్కుల రూపంలో జమ చేయనున్నట్టు తెలిపారు. లొంగిపోయిన వారిలో చత్తీస్‌గఢ్ లోని సుక్మా జిల్లా జెట్టపాడు గ్రామానికి చెందిన శ్యామల రాజేష్ అలియాస్ ఐత (22), అదే జిల్లా గొమ్ము గ్రామానికి చెందిన కస్తిల్దుమ (20), బీజాపూర్ జిల్లా పెద్ద బట్టిగూడెం కొండపల్లి గ్రామానికి చెందిన ఊకె జోగి (18), అదే గ్రామానికి చెందిన బాడీసే బీమా (21), అదే జిల్లా తంబెల్‌బట్టి గ్రామానికి చెందిన ముచక జోగి(16) ఎస్పీ ముందు లొంగిపోయిన వారిలో ఉన్నారు.

# ఎయిమ్స్‌లో దివ్యాంగుడికి కృత్రిమ కాలు ఏర్పాటు



బీబీనగర్ బీబీనగర్ ఎయిమ్స్‌లో మేక్ ఇన్ ఇండియా మొదటి డిజైన్ అయిన హై ప్రొఫైల్ కార్బన్ ఫైబర్ ఫుట్ (కృత్రిమ కాలు)ను ఓ దివ్యాంగుడికి అమర్చారు. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ రూపొందించిన ఈ కృత్రిమ కాలును శాస్త్రవేత్త, ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అహంతేమ్ శాంతా సింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్టిఫీషియల్ లింబ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, కృత్రిమ అవయవాలు దివ్యాంగులకు సహాయకరంగా ఉంటాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అ త్యవసరంగా గుర్తించిన ఐదు కృత్రిమ అవయవాల్లో తాము ఒకటి రూపొందించామన్నారు. కృత్రిమ కాలును హై ఎండ్ కార్బన్‌తో రూపొందించామని, ఇది ఖరీదైనప్పటికీ దివ్యాంగులకు వీటిని అమరుస్తున్నామన్నా రు. వీటి తయారీ ద్వారా దేశీయ డిమాండ్‌ను తీర్చడమేగాక అందుబా టు ధరకు, అధిక పనితీరు ఉండే టెక్నాలజీ సహాయంతో కృత్రిమ అవయవాలను రూపొందిస్తు న్నామన్నారు. తద్వారా దేశాన్ని గ్లోబల్ హబ్‌గా మారుస్తామన్నారు. కృత్రిమ కాలును భువనగిరికి చెందిన 52 ఏళ్ల దివ్యాంగుడు సంపత్ తిరుమల చవాన్‌కు అమర్చారు. కార్యక్రమంలో మహేశ్వ ర్‌రెడ్డి లక్కిరెడ్డి, డాక్టర్ వై.రంజిత్‌కుమార్, డాక్టర్ సందీప్ ధోలె, డాక్టర్ దీపాంకర్ సథ్‌పతి, డాక్టర్ సయ్యద్ ఇష్తికర్, డాక్టర్ దీపక్‌కుమార్, డాక్టర్ శ్రీకాంత్, రమేష్, డీన్ అభిషేక్ అరోరా, సంగీత, పాల్గొన్నారు.

# డెబిట్ కార్డు లేకుండానే ఈజీగా క్యాష్ విత్ డ్రా..




హైద్రాబాద్: అందుబాటులో డెబిట్ కార్డు లేకపోయినా నగదును విత్ డ్రా చేసుకునే సౌకర్యాన్ని ఆర్బీఐ కల్పిస్తోంది. గతంలో నగదు కోసం బ్యాంకులకు వెళ్లి ఖాతా నుంచి విత్ డ్రా చేసుకునే వాళ్ళు.. ఆధునిక టెక్నాలజీ సహాయంతో నగదు విత్ డ్రా కోసం బ్యాంకర్లు ఏటీఎంలను ఏర్పాటు చేశాయి. పదేళ్ల క్రితం వరకు నగదు విత్ డ్రా చేసుకోవాలంటే డెబిట్ కార్డుతో ఏటీఎం దగ్గరి వెళ్లాల్సి వచ్చేది. ఇటీవల మొబైల్ యాప్ ఆధారిత పేమెంట్స్ డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో చాలామంది లావాదేవీలను ఆన్ లైన్ చెల్లింపులే చేస్తున్నా రు. అయినా.. ఒక్కోసారి నగదు అవసరం రావచ్చు. ఆ సమయంలో ఏటీఎంకు వెళ్లి డెబిట్ క్యాష్ విత్ డ్రా చేసుకోవాలంటే డెబిట్ కార్డు తప్పనిసరి. అయితే డెబిట్ కార్డు అందుబాటులో లేకపోతే మాత్రం క్యాష్ విత్ డ్రా చేసుకోవడం కష్టంగా ఉండేది. కానీ ఆర్బీఐ వినియోగదారులకు కొత్త అవకాశాన్ని కల్పించింది. డెబిట్ కార్డు లేకుండానే ఏటీఎం వద్దకెళ్లి మనీ విత్ డ్రా చేసుకునే సౌకర్యాన్ని కల్పించిం ది.ఏటీఎంల వద్ద డెబిట్ కార్డు రహిత లావాదేవీలను నిర్వహించుకు నేందుకు ఆర్బీఐ వెసులుబాటు కల్పించిం ది. ఇందుకోసం ఏటీఎం నుంచి క్యాష్ విత్‌డ్రా చేసేందుకు యూపీఐ ఫీచర్‌ను వినియోగించుకోవచ్చు. ఏటీఎంల వద్ద డెబిట్ కార్డు రహిత లావాదేవీలు పూర్తి చేయొచ్చు. మొబైల్ యాప్స్.. గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి యాప్‌ల సాయంతో డెబిట్ కార్డు లేకున్నా మనీ విత్ డ్రా చేసుకోవచ్చు. యూపీఐ క్యూఆర్ కోడ్ స్కాన్ ఆధారంగా డెబిట్ కార్డు లేకుండా నగదు విత్‌డ్రా చేసుకోవ చ్చు.ఏటీఎంల వద్ద డెబిట్ కార్డు రహిత లావాదేవీల కోసం.. తొలుత ఏటీఎం స్క్రీన్‌పై యూపీఐ కార్డ్‌లెస్ క్యాష్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత విత్‌డ్రా చేయాలనుకుంటున్న నగదు మొత్తాన్ని ఎంపిక చేసుకోవాలి. విత్ డ్రా సెక్షన్‌లో క్యూఆర్ కోడ్ ఆప్షన్ మీద క్లిక్ చేస్తే తాత్కాలిక క్యూఆర్ కోడ్ జనరేట్ అవుతుంది. ఫోన్‌లోని బ్యాంకు యూపీఐ ఆధారిత యాప్‌తో దాన్ని స్కాన్ చేయాలి. యూపీఐ పిన్‌ను యాప్‌లో ఎంటర్ చేయాలి. ఆతరువాత ఏటీఎం నుంచి డబ్బులు బయటకు వస్తాయి. నగదు విత్‌డ్రా అయినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ కూడా వస్తుంది.యూపీఐ కార్డ్‌లెస్ విత్‌డ్రా లావాదేవీలపై రోజుకు కొన్నింటిపై కొన్ని బ్యాంకులు పరిమితులు విధించాయి. యూపీఐ కార్డ్‌లెస్ విత్‌డ్రా లావాదేవీల ఏటీఎంను భువనగిరి పట్టణంలో తొలిసారిగా ఏర్పాటు చేశారు. హితాచీ మనీస్పాట్ ఏటీఎం పేరుతో జగదేవ్‌పూర్ రోడ్డులో ఆవిష్కరించారు. క్రమంగా వీటిని రద్దీ ఏరియాలు, టూరిస్ట్ ప్రాంతాలకు విస్తరించనున్నట్లు కంపెనీ నిర్వాహకులు తెలిపారు.

## వర్ణ వివక్షపై పోరాడిన మోడల్ రీచల్ ఆత్మహత్య

హైద్రాబాద్: ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ మోడల్ శాన్ రీచల్ ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు కోల్పోవడం వేదన కలిగించే విషాదంగా మారింది. ఆమె పుదుచ్చేరిలో తండ్రి ఇంట్లో అధిక మోతాదులో నిద్రమాత్రలు మింగినట్లుగా తెలుస్తోంది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే స్థానిక ఆస్పత్రులకు తరలించినా ప్రయోజనం లేకపోయింది. చివరికి జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ లో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె వయస్సు 26 సంవత్సరాలు మాత్రమే. పోలీసుల సమాచారం ప్రకారం, ఆమె ఇంట్లో నుండి ఒక సూసైడ్ నోట్ కూడా గుర్తించారు. అందులో "నా మరణానికి ఎవరూ బాధ్యులు కావు" అంటూ రాసి పెట్టినట్లు తెలిపారు. ఆమె ఇటీవలే పెళ్లి చేసుకుంది. ఈ నేపథ్యంలో వివాహబంధంలో సమస్యలేనా? కుటుంబ ఒత్తిడేనా? లేక ఆర్థిక ఇబ్బందులా? అన్న కోణాల్లో విచారణ జరుగుతోంది. తహశీల్దార్ ఆధ్వర్యంలో పూర్తి స్థాయి విచారణకు అధికారులు ఆదేశించారు.రీచల్ ఇటీవల తన వృత్తిని కొనసాగించేందుకు ఆభరణాలను తాకట్టు పెట్టి విక్రయించాల్సి వచ్చిందని తెలిసింది. తండ్రిని ఆర్థిక సాయం కోరినప్పటికీ నిరాకరించాడట. "తండ్రి కొడుకుపై చూపిన ప్రేమను తనపై చూపలేదు" అనే భావన కూడా ఆమెను తీవ్రంగా ప్రభావితం చేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. రీచల్ మోడలింగ్ ప్రపంచంలో మాత్రమే కాకుండా భారతీయ సినీ, ఫ్యాషన్ పరిశ్రమల్లోనూ తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది. నల్లటి చర్మం గల మహిళలపై జరిగే వివక్ష గురించి ఆమె బహిరంగంగా మాట్లాడింది. ఫెయిర్ స్కిన్ ఆధిపత్యానికి ఆమె గట్టిగా ఎదురు నిలిచింది. 2022లో 'మిస్ పుదుచ్చేరి' టైటిల్ గెలుచుకోవడం ఆమె కెరీర్‌కు మైలురాయిగా నిలిచింది. తన మనోస్థైర్యంతో యువతకు ప్రేరణనిచ్చిన ఆమె, చివరికి మానసికంగా గుండెను విరిచేలా ఓ ఒత్తిడికి బలైంది.ఆమె మరణం సినీ, మోడలింగ్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేయడమే కాదు, మానసిక ఆరోగ్యంపై చర్చను మరోసారి తెరపైకి తెచ్చింది. ప్రతిభ ఉన్న ఒక యువతిని సమాజం ఎలా నిరుత్సాహపరచవచ్చు అనే ప్రశ్నలకు ఇది ఉదాహరణగా నిలిచింది.

## పెరుగుతున్న చైనా ఎగుమతులు

బీజింగ్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పెద్ద ఎత్తున సుంకాలు విధించబోతున్నారన్న అంచనాలతో బెంబేలెత్తిపోతున్న అనేక కంపెనీలు చైనాకు క్యూ కడుతున్నాయి. వాటి నుండి వెల్లువలా వచ్చి పడుతున్న ఆర్డర్లతో ఎగుమతులు గణనీయంగా పెరుగుతున్నాయి. విడుదలైన కస్టమ్స్ డేటా ప్రకారం జూన్‌లో చైనా ఎగుమతులు 5.8 శాతం పెరిగాయి. మేలో 4.8 శాతం మేర ఎగుమతులలో వృద్ధి కన్పించింది. ఇక దిగుమతులు కూడా ఈ ఏడాది మొదటిసారిగా 1.1 శాతం పెరిగాయి.చర్చలు తిరిగి ప్రారంభించేందుకు ట్రంప్, చైనా అధికారులు అంగీకరించడంతో అమెరికా సుంకాల విషయంలో తాత్కాలిక ఊరట లభించింది. దీంతో కంపెనీల నుండి భారీగా ఆర్డర్లు వస్తున్నాయి. అయితే గత సంవత్సరంతో పోలిస్తే ఎగుమతులు ఇప్పటికీ 16 శాతం తక్కువగానే ఉన్నాయి. మేలో పడిపోయిన 34.5 శాతం ఎగుమతులతో పోలిస్తే ఇది తక్కువే.వాణిజ్యంలో పెరుగుదల కారణంగా ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో చైనా ఆర్థిక వృద్ధి వేగం పుంజుకుంది. అమెరికాతో వాణిజ్య యుద్ధం కొనసాగుతున్నప్పటికీ చైనా వాణిజ్య కార్యకలాపాలు విస్తృతమవుతూనే ఉన్నాయి. ఈ ఏడాది మొదటి ఆరు నెలల కాలంలో వాణిజ్యం 2.8 ట్రిలియన్ డాలర్లు దాటింది. దీంతో 586 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులు కన్పిస్తోంది. దక్షిణాసియాకు ఎగుమతులు 13 శాతం పెరిగాయి. థాయిలాండ్‌కు 22 శాతం, వియత్నాంకు 20 శాతం, భారత్‌కు 18 శాతం మేర ఎగుమతులలో వృద్ధి కన్పించింది. యూరోపియన్ యూనియన్‌తో కూడా వాణిజ్యం 6.6 శాతం వృద్ధి చెందింది. మేతో పోలిస్తే జూన్‌లో రేర్ ఎర్త్ మెటల్స్ ఎగుమతులు ఏకంగా 32 శాతం పెరగడం గమనార్హం.చైనాపై మరోసారి సుంకాలు విధిస్తామని, అవి 30 శాతం వరకూ ఉంటాయని అమెరికా బెదిరించింది. అయితే ఇరు దేశాల మధ్య చర్చలు కొనసాగుతుండడంతో వాటి అమలును ఆగస్ట్ 12వ తేదీ వరకూ వాయిదా వేసింది. అప్పటి వరకూ ఎగుమతులు పెరుగుతూనే ఉంటాయని నిపుణులు తెలిపారు.

# తెలంగాణలో భవిష్యత్తు బీజేపీదే



నల్లగొండ : తెలంగాణలో రానున్నది బీజేపీ సర్కారేనని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నరపరాజు రాంచందర్ చెప్పారు. జిల్లా కేంద్రంలోని చిన్న వెంకటరెడ్డి ఫంక్షన్ హాల్ లో భాజాపా ముఖ్య కార్యకర్తల సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కుటుంబ పాలన నుండి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగించాలన్నారు. సోనియా గాంధీ కుటుంబ పాలనను తెలంగాణలో రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ పార్టీ దేశం కోసం, ప్రజల కోసం పని చేస్తుందని చెప్పారు. ఇతర పార్టీలు తన కుటుంబ సభ్యులకు ఆస్తులు కాపాడుకోవడం కోసమే పనిచేస్తారని విమర్శించారు. భాజపా కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి ప్రజల్లో కలిసి వారి కోసం పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అవినీతి పార్టీలకు చివర గీతం పాడాలన్నారు. భారతీయ జనతా పార్టీ ఎన్డీఏ నేతృత్వంలో 21 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నామని తెలంగాణలో కూడా త్వరలో అధికారం చేపట్టబోతున్నామని ఈ సందర్భంగా ఆయన వెలిబుచ్చారు. తెలంగాణ ప్రజలు రాజకీయ చైతన్యవంతులని వీరి చైతన్యంతో ముందుకు వెళ్తామన్నారు. తెలంగాణ రాజకీయాల్లో నల్లగొండ జిల్లా రాజకీయ చైతన్యం కలిగిందని, ఈ చైతన్యంతో ఇక్కడి నుండే ఉద్యమాలను మొదలు పెడుతున్నామన్నారు. భారతీయ జనతా పార్టీ కోసం నల్గొండ జిల్లాలో అనేక మంది కార్యకర్తలు ప్రాణ త్యాగం చేశారని, వారి త్యాగం వృధా కాదని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైందని, నల్లగొండ జిల్లాలో అపూర్వ సోదరులకు, తండ్రి కొడుకులకు ఇతర నాయకులకు సమర గీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. గత పది సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం అనేక అవినీతి అక్రమాలలో కోరుకుపోయిందని, ఫోన్ టాపింగ్, భూమాఫియా వంటి వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుతుందని విమర్శించారు. తెలంగాణలో రాజకీయ పోరాటాలు నల్లగొండ నుండి మొదలుపెట్టి కాషాయ జండా ఎగరవేస్తామని పేర్కొన్నారు. తెలంగాణలో రైతుల కొరకు యూరియా 9 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా, 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్ర ప్రభుత్వం పంపిస్తే, రైతులకు పంచకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం దళారులకు పంచిందని అన్నారు. రైతుబంధు, రైతు రుణమాఫీ ఇవ్వకుండా రేవంత్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని చెప్పారు. జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, గంగిడి మనోహర్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి తదితరులు ప్రసంగించారు. సీనియర్ నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, చింతా సాంబమూర్తి, మాధగోని శ్రీనివాస్ గౌడ్, గోలి మసూదన్ రెడ్డి, బండారు ప్రసాద్, పెళ్లి రామరాజు యాదవ్, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థికి గుండె పోటు స్పాట్‌లోనే డెడ్

కరుణాపురం :తెలంగాణలో గుండెపోటుతో విద్యార్థి మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. కరుణాపురం గ్రామంలో జ్యోతిబాపూలే బాలుర గురుకులంలో ఇంటర్ చదువుతున్న మణిదీప్(17) గుండెపోటుతో మృతి చెందాడు. ఇతని మృతిపై కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రస్తుత కాలంలో గుండె పోటుతో ఎక్కువగా మరణిస్తున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా గుండె పోటుతో మృతి చెందుతున్నారు. చిన్న పిల్లల నుంచి పెద్ద వాళ్ల వరకు గుండె పోటుతో చనిపోతున్నారు. మారుతున్న జీవనశైలి, ఆహార అలవాట్ల వల్ల గుండె పోటు బారిన పడుతున్నారు. ఈ మధ్య కాలంలో అయితే వీరి సంఖ్య బాగా పెరిగింది. కాలేజీలో క్లాస్ వింటూ, డ్యాన్స్ వేస్తూ, ఆడుతూ, తినేటప్పుడు ఇలా ఎందరో గుండె పోటుతో మృతి చెందారు. ఇటీవల హనుమకొండలో కూడా ఇలాంటి విషాద ఘటన జరిగింది. హనుమకొండలోని కరుణాపురం గ్రామంలో జ్యోతిబాపూలే బాలుర గురుకులంలో మణిదీప్(17) గుండెపోటుతో మృతి చెందాడు. ఇతను ప్రస్తుతం ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. మణిదీప్ చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇదిలా ఉండగా.. బీహార్‌లో పట్టపగలు సుల్తాన్‌గంజ్ పోలీసు స్టేషన్‌కు కేవలం 300 మీటర్ల దూరంలో గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులకు తెగబడ్డారు. జితేందర్ కుమార్ అనే న్యాయవాదిపై కాల్పులు జరపడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టపగలే కాల్పుల ఘటన చోటు చేసుకోవడంతో ప్రజలు భయా భ్రాంతులకు గురయ్యారు. స్థానికంగా గుర్తింపు పొందిన లాయర్ జితేందర్ కుమార్ రెగ్యులర్‌గా టీ తాగే షాపులో టీ తాగి వెళుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. అనంతరం దుండుగులు అక్కడి నుంచి పరారైనట్టు పాట్నా ఈస్ట్ ఎస్పీ పరిచయ్ కుమార్ తెలిపారు. తీవ్రంగా గాయపడిన లాయర్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందినట్టు చెప్పారు. ఘటనా స్థలం నుంచి మూడు ఖాళీ బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేశామని, అన్ని కోణాల్లోంచి విచారణ చేస్తున్నామని, సాధ్యమైనంత త్వరగా హంతకులను పట్టుకుంటామని అన్నారు. కాగా, అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీహార్‌లో గత 24 గంటల్లో చోటు చేసుకున్న కాల్పుల సంఘటనల్లో నలుగురు మరణించడం స్థానికంగా కలకలం సృష్టించింది.

# నాగచైతన్య మిస్ చేసుకున్న బంగారాలు





అనుకున్నామని జరగవు అన్నీ, అనుకోలేదని ఆగవు కొన్ని అని ఆత్రేయ గారు రాసింది అక్షరాలా నిజం. సినీ పరిశ్రమలో ఇది చాలా సార్లు ఋజువయ్యింది. నాగచైతన్య విషయంలో ఇది మరీ ఎక్కువనిపిస్తోంది. దర్శకుడు వెంకీ అట్లూరి ఇటీవలే ఇచ్చిన ఒక పాడ్ క్యాస్ట్ ఇంటర్వ్యూలో తన అయిదు సినిమాల కథలు ముందు చైతుకే వినిపించానని, కానీ డేట్లు ఇతరత్రా కారణాల వల్ల తమ కాంబో మిస్సయ్యిందని చెప్పుకొచ్చాడు. వరుణ్ తేజ్ కు తొలిప్రేమ ఎంత మంచి హిట్టుగా నిలిచిందో చూశాం. అఖిల్ మిస్టర్ మజ్ను మిస్ ఫైర్ అయ్యింది కాబట్టి దాని గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నితిన్ రంగ్ దే సైతం ఆశించిన ఫలితం అందుకోలేకపోయింది. ధనుష్ సార్ ఊహించని స్థాయిలో ఘన విజయం అందుకుంది. స్కూల్ బ్యాక్ డ్రాప్ తీసుకుని వెంకీ అట్లూరి నడిపించిన విలేజ్ డ్రామా క్లాసు మాసుని మెప్పించింది. ఇక దుల్కర్ సల్మాన్ లక్కీ భాస్కర్ అంతకు మించిన బ్లాక్ బస్టర్. ఏకంగా వంద కోట్ల క్లబ్బులో చేరింది. నెట్ ఫ్లిక్స్ లో నెలల తరబడి టాప్ ట్రెండింగ్ లో ఉండిపోయింది. ఇప్పుడు సూర్య తో ఛాన్స్ రావడానికి కారణం కూడా ఈ ట్రాక్ రికార్డే. చైతు మిస్ చేసుకున్న బంగారాలు టోటల్ గా మూడు. తొలిప్రేమ, సార్, లక్కీ భాస్కర్. వీటిలో ఏ రెండు చేసినా ఫ్యాన్స్ మరింత పండగ చేసుకునేవాళ్ళు. ఇదంతా వెంకీ అట్లూరి ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే అక్కినేని ఫ్యామిలీ మీద తనకున్న అభిమానం అలాంటిది. భవిష్యత్తులో ఎప్పటికైనా నాగార్జున, చైతులకు డైరెక్ట్ చేయాలని టార్గెట్ గా పెట్టుకున్నాడు. సరైన కథ సెట్ అయితే అదేమీ పెద్ద కష్టం కాదు కానీ అఖిల్ కు ఫ్లాప్ ఇచ్చిన లోటైతే వెంకీలో ఉంది. ప్రస్తుతం సూర్యతో ఫ్యామిలీ ఎంటర్ టైనర్ చేస్తున్న ఈ టైమ్లీ దర్శకుడు బయోపిక్స్, పీరియాడిక్స్ జోలికి వెళ్లకుండా సూర్యని చక్కగా ఆవిష్కరించే ప్రయత్నంలో ఉన్నాడు. సితార బ్యానర్ మీద భారీ బడ్జెట్ తో రూపొందుతున్న ఈ మూవీ అయ్యాక వెంకీ చేయబోయే తర్వాత లిస్టులో అయినా చైతు ఉంటాడేమో చూడాలి.

# లోక్ సభలో కొత్త అటెండెన్స్ వ్యవస్థ



న్యూఢిల్లీ:వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో నూతన అటెండెన్స్ వ్యవస్థను అందుబాటులోకి రానుంది. ఈ మేరకు కొత్త వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్లు లోక్ సభ వెల్లడించింది. కొత్త నిబంధనల ప్రకారం ఇకపై లాబీలో కాకుండా సభ్యులకు కేటాయించిన సీటు వద్దే హాజరు వేయాల్సి ఉంటుందని వివరించింది. కొన్ని సార్లు లాబీలు ఎంపీలతో నిండి ఉంటాయని, ఇలాంటి సందర్భాల్లో సమయం ఆదా అవుతుందని పేర్కొంది. ఇంకా కొంత మంది ఎంపీలు లాబీలోనే అంటెండెన్స్ వేసి కార్యకలాపాల్లో పాల్గొనకుండా వెళ్లిపోతున్నారని తెలిపింది. ఈ కొత్త అటెండెన్స్ వ్యవస్థను ప్రవేశపెట్టేందుకు స్పీకర్ ఓం బిర్లా ఆసక్తి చూపుతున్నారని అధికార వర్గాలు తెలిపాయి. అయితే కొంత కాలం పాటు ఎంపీలకు అలవాటు అయ్యే వరకు పూర్వం లాగే లాబీలోనూ అటెండెన్స్ పద్ధతి కొనసాగుతుందని వివరించాయి. పార్లమెంట్ ను పేపర్ లెస్ మార్చే ప్రయత్నాల్లో అటెండెన్స్ ను కూడా డిజిటల్ పద్ధతిలోకి మారుస్తామని గతేడాది స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఇందులో భాగంగా మంత్రులు, ప్రతిపక్ష నేత హాజరులో సంతకం చేయాల్సిన అవసరం ఉండదని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో రోజువారీ భత్యాలను పొందేందుకు సభ్యులు తమ హాజరును గుర్తించాల్సి ఉంటుంది. ఎంపీలు సభలో, చర్చల్లో ఎంత సమయం పాల్గొన్నారనే విషయం తెలుసుకునేందుకు హాజరును లెక్కిస్తారు. కాగా, పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జులై 21 నుంచి ఆగస్టు 21 వరకు సాగనున్నాయి. ఈ ప్రతిపాదినకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ఆమోదం తెలిపారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల దృష్ట్యా ఆగస్టు 13,14 తేదీల్లో సమావేశాలు ఉండవు అని రిజిజు వివరించారు. వర్షాకాల పార్లమెంట్ సెషన్ నేపథ్యంలో జులై 19న అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా ఈ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 12తో ముగియనున్నట్లు పేర్కొంది. కానీ ఇప్పుడు మరో వారం రోజుల పాటు పొడిగిస్తూ నిర్ణయించింది. ప్రభుత్వం ముఖ్యమైన బిల్లులను ప్రవేశపెట్టేందుకు భావిస్తోంది. అందులో అణుశక్తి రంగంలో ప్రైవేటు సెక్టర్ ప్రవేశాన్ని అనుమతించే చట్టాలతో పాటు సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ యాక్ట్, అటామిక్ ఎనర్జీ చట్టంలో సవరణలు చేయాలని యోచిస్తోంది. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన అంశాలను అమలు చేయడానికే ఈ వారం రోజుల వ్యవధిని పొడిగించినట్లు భావిస్తున్నారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ పై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. అలాగే భారత్-పాక్ మధ్య యుద్ధాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యపై స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశాయి. ట్రంప్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మధ్య జరిగిన ఫోన్ సంభాషణను కూడా తెలపాలని పట్టుబట్టిన నేపథ్యంలోనే వర్షాకాల సమావేశాలు వాడీవేడీగా సాగే అవకాశం ఉంది. అయితే 2025లో జనవరి 31వ తేదీ- ఏప్రిల్ 4వ తేదీ మధ్యలో రెండు దశల్లో బడ్జెట్ సమావేశాలు జరిగాయి.

# బలవంతంగా 'నానో' ఎరువులు అమ్మొద్దు

న్యూఢిల్లీ : నానో ఎరువుల అమ్మకాలకు వ్యతిరేకంగా రైతులు చేస్తున్న ఆందోళనలకు కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. నానో ఎరువులు, బయోస్టిమ్యులెంట్లను బలవంతంగా రైతుల కు అమ్మడాన్ని తక్షణమే నిలిపివేయాలని రాష్ట్రాలకు కేంద్రం లేఖ రాసింది. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఈమేరకు లేఖ రాశారు. యూరియా, డీఏపీ వంటి సబ్సిడీపై లభించే సాంప్రదాయ ఎరువుల స్థానంలో రైతులకు బలవంతంగా నానో ఎరువులను విక్రయించవద్దని లేఖలో మంత్రి స్పష్టం చేశారు. నానో ఎరువులు కొనుగోలు చేయకపోతే రైతులకు సాంప్రదాయ ఎరువులను విక్రయించడం లేదని వస్తున్న ఫిర్యాదులను మంత్రి ప్రస్తావించారు. ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. నకిలీ, నాసిరకం ఎరువుల అమ్మకాలపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలకు విక్రయించడం, సబ్సిడీ ఎరువుల మళ్లింపు వంటి కార్యకలాపాలను రాష్ట్రాలు కఠినంగా పర్యవేక్షించాలని, వాటిపై వేగంగా చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ఎరువుల ఉత్పత్తి, అమ్మకాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని రాష్ట్రాలకు సూచించారు. సాంప్రదాయ ఎరువులకు బదులుగా నానో ఎరువులు, బయోస్టిమ్యులెంట్ల విక్రయాలు పెంచాలన్న కేంద్రం నిర్ణయంపై దేశంలోని పలు ప్రాంతాల్లో రైతులు ఆందోళనలు చేశారు. సాంప్రదాయ ఎరువులతో పోలిస్తే వీటి ధర అధికంగా ఉండటం, వీటి వినియోగంతో సరైన దిగుబడులు రాకపోవడంతో అన్నదాతలు వీటిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

# భర్తను నరికి చంపిన భార్య..

హైదరాబాద్: బీహార్ లోని పూర్ణియా జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. కన్న కొడుకు కళ్ల ముందే భర్తను నరికి చంపిందో భార్య.. నోరు తెరిస్తే నీకూ ఇదే గతి పడుతుందని బెదిరించడంతో పన్నెండేళ్ల ఆ బాలుడు భయంతో వణికి పోయాడు. ప్రియుడితో కలిసి ఉండేందుకే భర్తను చంపేసినట్లు నిందితురాలు పోలీసులకు వెల్లడించింది. వివరాల్లోకి వెళితే.. పూర్ణియా జిల్లాకు చెందిన బాలో దాస్ (45), ఉషా దేవి దంపతులకు ముగ్గురు పిల్లలు. కుటుంబ పోషణ కోసం బాలో దాస్ పంజాబ్ లో కూలీ పనులు చేసేవాడు. పిల్లలతో కలిసి ఉషా దేవి సొంతూళ్లో ఉండేది. ఈ క్రమంలో ఉషా దేవికి గ్రామంలోనే ఓ యువకుడితో వివాహేతర సంబంధం ఏర్పడింది. భర్తకు తెలియకుండా తమ ఇంటి జాగాను వేరే వారికి అమ్మేసింది. ఆ సొమ్ముతో ప్రియుడితో కలిసి పరారయ్యేందుకు సిద్ధమైంది. భూమి అమ్మిన విషయం తెలిసిన వెంటనే బాలో దాస్ సొంతూరుకు చేరుకున్నాడు. దీంతో ఉషా దేవి ప్లాన్ విఫలమైంది. భూమి అమ్మకంపై భర్త నిలదీయడం, ప్రియుడిని కలుసుకునే వీలులేకపోవడంతో ఉషా దేవి దారుణమైన నిర్ణయం తీసుకుంది. రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న భర్తను గడ్డి కోసే కత్తితో నరికింది. రక్తం చింది తండ్రి పక్కనే పడుకున్న కొడుకు ముఖంపై పడింది. కళ్లు తెరిచి చూసిన పన్నెండేళ్ల బాలుడికి కత్తితో తండ్రిని నరుకుతున్న తల్లి కనిపించింది. భయంతో కేకలు వేసేందుకు నోరు తెరిచిన కొడుకును ఉషా దేవి బెదిరించింది. నోరు మూసుకోకుంటే నీ తండ్రిలాగే నిన్నూ చంపేస్తానని హెచ్చరించింది. దీంతో వణికిపోయిన బాలుడు తెల్లారే వరకూ అలాగే ఉండిపోయాడు. ఆ తర్వాత బంధువుల ఇంటికి వెళ్లి జరిగిన ఘోరాన్ని వారికి వివరించాడు. విషయం తెలిసి బంధువులతోపాటు చుట్టుపక్కల వారు బాలో దాస్ ఇంటికి చేరుకున్నారు. గ్రామస్థుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఉషా దేవిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ప్రియుడితో కలిసి పారిపోయేందుకే భర్తను హత్య చేసినట్లు ఉషా దేవి అంగీకరించిందని పోలీసులు వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# తండ్రి బాటలోనే నాగ చైతన్యా..



ఫ్లాపుల పరంపరకు తెరదించుతూ 'తండేల్' మూవీతో ఉపశమనాన్ని అందుకున్నాడు అక్కినేని నాగచైతన్య. ఈ సినిమా గురించి రిలీజ్ ముంగిట టీం చెప్పిన స్థాయిలో అద్భుతాలు జరిగిపోకున్నా.. ఉన్నంతలో మంచి ఫలితాన్నే అందుకుంది. దీంతో హమ్మయ్య అనుకున్న చైతూ.. తన తర్వాతి చిత్రానికి ఉత్సాహంగా సిద్ధమయ్యాడు. 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో చైతూ.. ఒక భారీ మిస్టిక్ థ్రిల్లర్లో నటిస్తున్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్లో బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ మధ్యలో ఉంది. దీని తర్వాత చైతూ నటించే సినిమా గురించి ఇప్పుడు ఆసక్తికర ప్రచారం జరుగుతోంది. అతను ఓ తమిళ దర్శకుడితో జట్టు కట్టబోతున్నట్లు సమాచారం. అతనే.. పి.ఎస్.మిత్రన్. తమిళంలో థ్రిల్లర్ చిత్రాలకు పేరుపడ్డాడు మిత్రన్. ఇప్పటిదాకా అతను తీసినవన్నీ థ్రిల్లర్ సినిమాలే. విశాల్ హీరోగా తెరకెక్కిన బ్లాక్ బస్టర్ మూవీ 'ఇరింబు తిరై' (తెలుగులో అభిమన్యుడు) చిత్రంతో దర్శకుడిగా పరిచయం అయ్యాడు మిత్రన్. ఆ తర్వాత శివ కార్తికేయన్‌తో తీసిన 'శక్తి' సినిమా కూడా హిట్ అయింది. ఆపై కార్తితో అతను చేసిన 'సర్దార్' ఇంకా పెద్ద హిట్ అయింది. ప్రస్తుతం మిత్రన్.. కార్తితోనే 'సర్దార్-2' చేస్తున్నాడు. దీపావళికి ఆ సినిమా రిలీజ్ కాబోతోంది. మిత్రన్ తెలుగులో సినిమా చేస్తాడని ఇంతకుముందే వార్తలు వచ్చాయి. ఇప్పుడు చైతూతో అతను సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. తన శైలికి తగ్గట్లే థ్రిల్లర్ కథను చేయాలని అనుకుంటున్నాడట. అది పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కే అవకాశాలున్నాయి. ప్రస్తుతం చైతూ తండ్రి నాగార్జున సైతం రా.కార్తీక్ అనే తమిళ దర్శకుడితో సినిమాకు సన్నాహాలు చేసుకుంటున్నాడు. త్వరలోనే ఆ సినిమా మొదలు కాబోతోంది. తండ్రి బాటలో చైతూ సైతం తమిళ దర్శకుడితోనే జట్టు కట్టబోతుండడం విశేషమే. త్వరలోనే ఆ సినిమా గురించి అధికారిక ప్రకటన వస్తుందని తెలుస్తోంది. ఐతే గత కొన్నేళ్లలో తెలుగు హీరోలతో తమిళ దర్శకులు చేసిన సినిమాలేవీ సరిగా ఆడని విషయం గమనార్హం.

# ఆధార్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి అలర్ట్..

హైద్రాబాద్: పజలందరూ తమ ఆధార్ కార్డులో వివరాలను, బయోమెట్రిక్‌లను తప్పకుండా అప్‌డేట్ చేసుకోవాలని సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేష్‌బీగీతే కోరారు. ఇటీవల కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఈ ఆదేశాలు జారీ చేశారు. కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. పౌరులందరికీ తప్పనిసరిగా ఆధార్ కార్డు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే ప్రసవాల వివరాలను ఈ-బర్త్ పోర్టల్‌లో నమోదు చేయాలని కోరారు. ప్రతి 10 వేల జనాభాకు ఒక కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేయాలని, త్వరలో మరో 36 CSC కేంద్రాల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని, ప్రస్తుతం ఉన్న కొన్ని సెంటర్లను మార్చాలని సూచించారు. జిల్లాలో 5 నుండి 15 సంవత్సరాలలోపు ఉన్న 27 వేలకు పైగా జనాభాకు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించాలని కలెక్టర్, ఎస్పీ ఉద్ఘాటించారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రత్యేక అవగాహన క్యాంపులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా సంక్షేమాధికారి మాట్లాడుతూ.. 5 సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్ కార్డులు అందేలా చూడాలన్నారు. 18 సంవత్సరాలు దాటిన వారికి ఆధార్ నమోదుకు సంబంధించి తహసీల్దార్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కోరారు. మండల కేంద్రాల్లో ఆధార్ కార్డు వివరాలను అప్‌డేట్ చేసేందుకు ప్రత్యేక క్యాంపుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో మీ సేవా కేంద్రాల్లో ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవా లని సూచించారు. పోస్టల్ కార్యాలయం నుంచి ఎన్ని ఆధార్ కార్డులు తప్పుడు చిరునామాల కారణంగా వెనక్కి వచ్చాయో వివరాలు అందించాలన్నారు. జిల్లాలోని వివిధ అనాథ శరణాలయాల్లో పెరుగుతున్న వారికి ఆధార్ నమోదులో వచ్చే సమస్యలను పరిష్కరించాలని కోరారు.

# నైపుణ్యాలతోనే నేటి తరానికి మెరుగైన ఉపాధి అవకాశాలు

నల్లగొండ: మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో కాంపేటస్ ఫార్మా ట్రైనింగ్ సెంటర్, హైదరాబాద్ వారి సహకారంతో ఫార్మా మరియు లైఫ్ సైన్సెస్ రంగాల తీరుతెన్నులు మరియు ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉపకులపతి ఆచార్య కాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడారు. నేటి తరానికి నైపుణ్యాలు ప్రామాణికమని, వారికే మెరుగైన ఉపాధి అవకాశాలు సాధ్యమని అన్నారు. నిత్య విద్యార్థులుగా మెరుగుపరుచుకుంటూ మేలైన అవకాశాలను దక్కించుకోవాలని కోరారు. కాంపిటస్ సంస్థ ప్రతినిధి ఆర్ ఎన్ దీపక్ వర్మ మాట్లాడుతూ నేడు ఫార్మా మరియు లైఫ్ సైన్సెస్ రంగాలలో ఉపాధి అవకాశాలు, జీవన నైపుణ్యాలు, ఇంటర్వ్యూ విధానంను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డా ప్రేమ్సాగర్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ డైరెక్టర్ డా తిరుమల, కోఆర్డినేటర్ డా అభిలాష, తదితర అధ్యాపకులు, బయోటెక్నాలజీ, బయో కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ ఫార్మా, బాటని విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగంపై బీజేపీ వివక్ష



గోదావరిఖని, : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి యూరియా కోటా తగ్గించి కక్ష సాధింపులకు పాల్పడుతుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆరోపించారు. రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్)ను సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్ఎఫ్‌సీఎల్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత యువతకు ఉపాధి లభిస్తుందని, రైతాంగానికి ఎరువులు అందుబాటులో ఉంటాయని ప్రజలు భావించారన్నారు. మన్మోహన్ సింగ్ సారధ్యంలోని యూపీఏ ప్రభుత్వం ఎఫ్‌సీఐ పునరుద్ధరణకు అన్నీ చర్యలు చేపట్టిందన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డా ఆర్ఎఫ్‌సీఎల్ నిర్మాణాన్ని స్వాగతించారన్నారు.కానీ ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం బీజేపీ పాలిత రాష్ట్రాలకు అధిక యూరియా కేటాయించి తెలంగాణపై వివక్ష చూపుతుందన్నారు. రాష్ట్ర రైతాంగాన్ని ఇబ్బందులు పెడుతున్న బీజేపీ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గత సంవత్సరం కంటే ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి 1.14లక్షల టన్నులు తక్కువ కేటాయించారని, జూలై కోటాలోనే 30వేల టన్నులు తగ్గించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ఎరువుల శాఖ మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాను కలిసి విజ్ఞప్తి చేసినా సరఫరా పెరగలేదన్నారు. వరి నాట్ల సీజన్ మొదలైందని, పది రోజుల్లో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈలోపే కేంద్రం యూరియాను సరఫరా చేయాలని కోరారు. తాను కూడా కేంద్ర మంత్రిని కలిసి రైతాంగం ఇబ్బందుల గురించి వివరిస్తానన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో సైతం ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి యూరియా కేటాయించకపోవడాన్ని లేవనెత్తుతామన్నారు. కాంగ్రెస్ నాయకులు గుమ్మడి కుమారస్వామి, మల్లికార్జున్, తొగరి తిరుపతి, కామ విజయ్, జీన్స్, నర్సింగ్‌దొర తదితరులు ఉన్నారు.

## చైనాతో సరిహద్దు సమస్యలపై పార్లమెంట్‌లో

# డిబేట్ పెట్టాల్సిందే: కాంగ్రెస్

న్యూఢిల్లీ:1962 చైనా దురాక్రమణ గురించి పార్లమెంట్ లో చర్చించినప్పుడు, ప్రస్తుతం ఇరుదేశాల మధ్య ఉన్న సరిహద్దు సమస్యలపై కూడా ఎందుకు చర్చించకూడదని కాంగ్రెస్ పార్టీ మోదీ సర్కార్ ను సూటిగా ప్రశ్నించింది. ప్రధాని నరేంద్ర మోదీ రానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశంలో చైనా సరిహద్దు వివాదాలపై చర్చకు అంగీకరిస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొంది'ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, ప్రముఖ ఉత్పాదక శక్తిగా చైనా ఎదుగింది. ఇలాంటి తరుణంలో చైనా నుంచి ఎదురయ్యే క్లిష్టమైన ఆర్థిక, భద్రతాపరమైన సవాళ్లపై జాతీయ ఏకాభిప్రాయాన్ని సాధించడం అత్యవసరమని' కాంగ్రెస్ పేర్కొంది.మోదీ సర్కార్ చెప్పినట్లు ప్రస్తుతం భారత్ – చైనా సంబంధాలు బాగుంటే, మరి ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ కు చైనా ఎందుకు సాయం చేసిందని కాంగ్రెస్ సూటిగా ప్రశ్నించింది.త్వరలో పాకిస్థాన్ చైనా నుంచి జే-35 స్టెల్త్ విమానాలు కొనుగోలు చేసే అవకాశం ఉందని జైరాం రమేశ్ అన్నారు. అదే సమయంలో చైనా అరుదైన ఎర్త్ మేగ్నెట్స్ , స్పెషల్ ఫెర్టిలైజర్స్ , టన్నెల్-బోరింగ్ యంత్రాలను భారత్ కు ఎగుమతి చేయకుండా పరిమితులు విధించిందని ఆయన గుర్తు చేశారు. టెలికాం, ఫార్మాస్యూటికల్స్ , ఎలక్ట్రానిక్స్ మొదలైన కీలక రంగాలు చైనా దిగుమతులపై ఆధారపడి ఉన్నాయని, అలాగే చైనాతో భారత వాణిజ్య లోటు మునుపెన్నడూ లేనంతగా రికార్డ్ స్థాయిలో 99.2 బిలియన్ డాలర్లకు చేరుకుందని ఆయన అన్నారు. 'భారత్ లోని ఫాక్స్ కాన్ ఫెసిలిటీ నుంచి వందలాది మంది చైనా కార్మికులు వైదొలిగారు. అందువల్ల చైనాకు పోటీగా యాపిల్ స్మార్ట్ ఫోన్ సరఫరదారుగా మారడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాలకు పెద్ద అడ్డంగి ఏర్పడింది' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. 'ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి జైరాం రమేశ్ భారత ప్రజలను విశ్వాసంలోకి తీసుకుని పార్లమెంట్ లో చైనా గురించి వివరణాత్మక చర్చకు అంగీకరిస్తారని మేము ఆశిస్తున్నాము' అని జైరాం రమేశ్ అన్నారు. "1962 నవంబర్ నెలలో భారత్ పై చైనా దండయాత్ర గురించి పార్లమెంట్ లో చర్చిద్దామని మోదీ సర్కార్ అంటోంది. అలాగే ఇప్పుడు ఇరుదేశాలు ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం అవుతున్నాయని చెబుతోంది. కానీ వాస్తవానికి తూర్పు లద్ధాఖ్ లో వాస్తవ నియంత్రణ రేఖపై మే 2020 స్థితిని ఇంకా పునరుద్ధరించలేదు. అందువల్ల ఈ విషయం గురించి ఇప్పుడు పార్లమెంట్ లో ఎందుకు చర్చించకూడదు" అని జైరాం రమేశ్ అన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు బాగు



చేవెళ్ల, జులై 14:ఒకసారి సాగు చేస్తే 40 ఏళ్ల వరకు లాభాలు తెచ్చిపెట్టే ఆయిల్ పామ్ పంటపై రైతులు దృష్టి పె ట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పి లుపునిచ్చారు. 'ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్'లో భాగంగా చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలం లోని పెద్దవీడు గ్రామంలో రైతు సురేందర్ రెడ్డికి చెందిన 20 ఎకరాల పొలంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ డా.పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి మొక్కలు నా టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మా ట్లాడుతూ... రంగారెడ్డి జిల్లా పచ్చబడితే తెలంగాణ మొత్తం పచ్చబడు తుందని, జిల్లాలోని రైతులెవరూ భూములు అమ్ముకోకుండా పంటలు వేసుకో వాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 3 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట సాగవుతోందని, ఈ సంవత్సరం మరో 3 వేల ఎకరాలకు పెరగాల న్నారు. కంపెనీ ప్రతినిధులే తోటకు వచ్చి పంటను సేకరిస్తారని, ధర, రవాణా వంటి ఇబ్బం దులు కూడా ఉండవని చెప్పారు.దేశానికి వంద లక్షల మెట్రిక్ టన్నుల ఆయిల్ అవసరం ఉంటే ప్రస్తుతం 3 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే పండిస్తున్నామన్నారు. ఇతర దేశాల నుంచి లక్షన్నర కోట్లు పెట్టి ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నామని, ఇక్కడే పండిస్తే ఆ డబ్బులు రైతులే సంపాదిం చుకోవచ్చన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట సాగుకు వీలుందని.. కనీ సం 10 లక్షల నుంచి 15 లక్షల ఎకరాల్లో పంట వేసినా దేశానికి ఆయిల్ సరఫరా చేయవచ్చున్నా రు. రానున్న రెండు, మూ డేళ్లలో రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల్లో పది ఫ్యాక్టరీలను నిర్మించనున్నామని, ఇందుకో సం పూర్తి అనుమతులు పొం దామని వివరించారు. వచ్చే నెలలో సిద్ధిపేటలో ఆయిల్ పా మ్ ఫ్యాక్టరీని ప్రారంభించ నున్నట్లు తెలిపారు. పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతు భరోసా, రుణమాఫీ ఏకకాలంలో అమలు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదని కొనియాడారు. జిల్లాలో 2 .83 లక్షల మంది రైతుల అకౌంట్లలో రూ. 323 కోట్ల రైతుభరోసా, 1.4 లక్షల మంది రైతులకు రూ.747 .41 కోట్ల రుణ మాఫీ అమలు చేశామని స్పష్టం చేశారు.సర్దార్ నగర్ మార్కెట్ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులను మంజూరు చేసిందని వెల్లడించారు. ఈ కార్యక్రమం లో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూ దన్ రెడ్డి, ఉద్యానవన, పట్టు పరిశ్రమల డైరెక్టర్ యస్మిన్ బాషా, జా యింట్ డైరెక్టర్ సంగీత లక్ష్మి, జిల్లా అధికారి సురేష్, వాల్యు ఆయిల్ ఎండీ రామకృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణ రెడ్డి, చేవెళ్ల, సర్దార్ నగర్ ఏ ఎంసీ చైర్మన్లు పెంటయ్య గౌడ్, పీసరి సురేందర్ రెడ్డి, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి, టీపీసీసీ మెంబర్ ఫాబాద్ దర్శన్, హార్టి కల్చర్ డివిజన్ ఆఫీసర్ కీర్తి కృష్ణ, ఏ వోలు , ఏఈవోలు, రైతులు పా ల్గొన్నారు.

# భార్య నుంచి భరణం కోరుతూ కోర్టు మెట్లెక్కిన భర్త..

భారతీయ చట్టాలు ఆడవారికే ఎక్కువ అనుకూలంగా ఉంటాయని మగవాళ్లు ఎప్పటినుంచో ఆరోపిస్తున్నారు. 498ఏ వంటి చట్టాల గురించి ఎన్నో ఏళ్లుగా చర్చ నడుస్తోంది. ఇక విడాకుల విషయానికి వచ్చేసరికి భర్తలకు భరణం అనేది భారంగా మారుతుందనే చర్చ ఎప్పటినుంచో నడుస్తోంది. ఎంతో మంది సంపన్నులు తమ భార్యలకు పెద్ద మొత్తంలో డబ్బులు ఇచ్చి విడాకులు తీసుకున్న ఘటనలు చాలా ఉన్నాయి. అదే సమయంలో భార్యకు భరణం ఇవ్వడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న భర్తలూ ఉన్నారు. కొంతమంది మహిళలు దీనినే ఆయుధంగా చేసుకుని పెళ్లిళ్లు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ తరుణంలో ఓ భర్త తన భార్య నుంచి భరణం ఇప్పించాలంటూ కోర్టు మెట్లక్కడం సంచలనంగా మారింది. కింది కోర్టు ఆయన పిటిషన్ కొట్టేయగా.. హైకోర్టును ఆశ్రయించాడు. పీసీఎస్ ఆఫీసర్ జ్యోతి మౌర్య తన భర్త అలోక్ కుమార్ నుంచి విడాకులు కోరింది. ఈ నేపథ్యంలో తన భార్య నుంచి భరణం ఇప్పించాలని అతడు ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. కానీ కోర్టు ఆ పిటిషన్‌ను తిరస్కరించింది. ఆ తర్వాత అతడు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు విచారణ చేపట్టి జ్యోతికి నోటీసులు జారీ చేసింది.అలోక్ 2009లో పంచాయతీ రాజ్ శాఖలో సఫాయి కర్మచారిగా నియమితులయ్యారు. ఆయన 2010లో జ్యోతి మౌర్యను వివాహం చేసుకున్నారు. పెళ్ల తర్వాత భార్య చదువుకుంటానని చెప్పడంతో బాగా చదివించాడు. 2015లో పీసీఎస్ పరీక్షలో ఆమె అర్హత సాధించిన తర్వాత ఎస్డీఎమ్‌గా బాధ్యతలు చేపట్టింది. అప్పటి నుంచి తనతో పాటు తన కుటుంబం పట్ల ఆమె వైఖరీ మారిందని అలోక్ ఆరోపించాడు. ఆ తర్వాత తన నుంచి విడాకులు కోరిందని వివరించారు. విడాకుల పిటిషన్ పెండింగ్‌లో ఉన్న సమయంలోనే అలోక్ హిందూ వివాహాల చట్టంలోని సెక్షన్ 24 కింద భరణం కోసం దరఖాస్తు దాఖలు చేశారు. దీనిని ప్రయాగ్‌రాజ్ కుటుంబ కోర్టు తిరస్కరించింది. దాంతో అతడు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు విచారణ చేపట్టింది. దీనిపై కోర్టు ఎటువంటి తీర్పు ఇస్తుందనేది ఆసక్తిగా మారింది.

# నకిలీ ఇంజెక్షన్ల రాకెట్ బట్టబయలు

హైదరాబాద్, : నగరంలో జిమ్ బాడీల మోజులో ఉన్న యువతను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న నకిలీ ఇంజెక్షన్ల దందాను కమిషనర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు భగ్నం చేశారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా, అధిక ధరలకు అమ్ముతున్న ప్రాణాంతక మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్ల రాకెట్‌ను గుట్టురట్టు చేశారు. సౌత్-ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్, చత్రినాక పోలీసులతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.వారి నుంచి రూ. 5 లక్షల విలువైన నకిలీ మందులు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మోడలింగ్ వృత్తిలో ఉన్న మహ్మద్ జుబేర్, మెడికల్ డిస్ట్రిబ్యూటరైన వెలుదండి వినయ్ కుమార్ తో కలిసి ఈ దందాకు తెరలేపాడు. వినయ్ కుమార్ ఉత్తరప్రదేశ్లోని మీరట్కు చెందిన కపిల్ గౌతమ్ అనే వ్యక్తి నుంచి ఈ ఇంజెక్షన్లను అక్రమంగా కొనుగోలు చేసి నగరానికి తరలిస్తున్నాడు.అనంతరం, శరీర వృద్ధిని వేగవంతం చేస్తాయని, కండరాలు త్వరగా వస్తాయని యువతను, ముఖ్యంగా జిమ్‌కు వెళ్లేవారిని నమ్మించి, ఈ ఇంజెక్షన్లను అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. మొదట ఈ ఇంజెక్షన్లకు బానిసైన జుబేర్, ఆ తర్వాత వినయ్ కుమార్‌తో చేతులు కలిపి విక్రయాలు మొదలుపెట్టాడు.నగరంలో నకిలీ ఇంజెక్షన్ల దందా జరుగుతున్నట్లు పక్కా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు, నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. సరైన ఆధారాలతో చత్రినాక పోలీసుల సహకారంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌ను అడిషనల్ డీసీపీ టాస్క్‌ఫోర్స్ అండె శ్రీనివాసరావు మార్గదర్శకత్వంలో, సౌత్-ఈస్ట్ జోన్ ఇన్స్పెక్టర్ ఎన్. సైదాబాబు పర్యవేక్షణలో ఎస్ఐలు కె.రామారావు, ఎం.మధు, సిబ్బంది విజయవంతంగా పూర్తి చేశారు. ఇలాంటి నకిలీ ఔషధాల పట్ల ప్రజలు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని, వైద్యుల సలహా లేకుండా ఎలాంటి మందులు వాడొద్దని పోలీసులు హెచ్చరించారు.

# ద్వేషపూరిత ప్రసంగాలను నియంత్రించండి



న్యూఢిల్లీ:భావ ప్రకటన స్వేచ్ఛకు ఎలాంటి భంగం కలిగించకుండానే, ద్వేషపూరిత ప్రసంగాలను నియంత్రించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు నిర్దేశించింది. సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్ శర్మిష్ఠ పనోలిపై వజాహత్ ఖాన్ దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ చేస్తూ సర్వోన్నత న్యాయస్థానం 'ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్' గురించి కీలక వ్యాఖ్యలు చేసింది. ద్వేషపూరిత ప్రసంగాన్ని "భావ ప్రకటన స్వేచ్ఛ"గా భావిస్తుండడం విచారకరమని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. వాక్ స్వాతంత్ర్యం విలువ గురించి రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించింది.' 'విద్వేషపూరిత ప్రసంగాలు చేసే వారికి అవి ఎంత అసభ్యకరంగా, అనుచితంగా ఉంటున్నాయో ఎందుకు అర్థం కావట్లేదు వాస్తవానికి ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలను షేర్ చేయకుండా కట్టడి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజలు కూడా ద్వేషపూరిత ప్రసంగాలను షేర్ చేయడం, లైక్ చేయడం లాంటివి చేయకుండా తమను తాము నియంత్రించుకోవాలి. మేము సెన్సార్‌షిప్ గురించి మాట్లాడడం లేదు. కానీ, ప్రజలు ఇలాంటి అంశాలపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. సోషల్ మీడియాలో విస్తరిస్తున్న ఈ విభజన ధోరణిని అడ్డుకోవాల్సిందే" అని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అంతేకాదు "ఇటువంటి కేసుల్లో ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని ఎవరూ కోరుకోరు. కానీ వాక్ స్వాతంత్ర్యంపై బాధ్యతాయుత ఆంక్షలు సరైనవే. వాక్ స్వాతంత్ర్యం, భావ వ్యక్తీకరణ విలువలను ప్రజలు అర్థం చేసుకోవాలి'' అని సుప్రీంకోర్టు పేర్కొంది. సోషల్ మీడియాలో ద్వేషపూరిత, మత విద్వేషాలను రెచ్చగొట్టే కంటెంట్ ను పోస్ట్ చేశారనే ఆరోపణలపై వజాహత్ ఖాన్ పై వివిధ రాష్ట్రాల్లో కేసులు నమోదు అయ్యాయి. అయితే అంతకంటే ముందే, అతను ఒక ఎఫ్ ఐఆర్ లో పోలీసు కస్టడీలో ఉన్నట్లు, మరొక ఎఫ్ ఐఆర్ లో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నట్లు ఉంది. ఈ రెండూ పశ్చిమ బెంగాల్ లోనే నమోదు కావడం గమనార్హం. తరువాత ఆ రాష్ట్రం వెలుపల నమోదైన ఓ కేసులో వజాహత్ ఖాన్ ను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఆ అరెస్టును సుప్రీంకోర్టు నిలిపివేసింది. ఈ నేపథ్యంలో వజాహత్ ఖాన్ తనపై దాఖలైన అన్ని కేసులను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాడు. వాజాహత్ ఖాన్ గతంలో తాను చేసిన ట్వీట్లకు క్షమాపణలు చెప్పినట్లు ఆయన తరఫు న్యాయవాది ధర్మాసనానికి తెలియజేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా, ద్వేషపూరిత ప్రసంగాలను, పోస్టులను నియంత్రించే మార్గాలను సూచించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, వజాహత్ ఖాన్ తరఫున హాజరైన న్యాయవాదిని సర్వోన్నత న్యాయస్థానం కోరింది. అంతేకాదు వజాహత్ ఖాన్ కు ఉపశమనం కల్పిస్తూ, 'ఒక వ్యక్తిపై పలు ఎఫ్ ఐఆర్ లు నమోదు చేసి, అతనిని జైలులో పెట్టడం వల్ల ప్రయోజనం ఏమిటి ' అని ప్రశ్నించింది. ఈ కేసుపై జూన్ 24న చేసిన విచారణ సందర్భంగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు విశ్వనాథన్, ఎన్ . కోటీశ్వర్ సింగ్ లతో కూడిన ధర్మాసనం కేంద్రంతో సహా అసోం, దిల్లీ, హరియాణా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. వివిధ రాష్ట్రాల్లో తనపై నమోదైన ఎఫ్ ఐఆర్ లను ఏకీకృతం చేయాలని కోరుతూ వజాహత్ ఖాన్ చేసిన పిటిషన్ పై స్పందించాలని కోరింది.

# భారత్‌కు రష్యా బంపర్ ఆఫర్..



న్యూఢిల్లీ:రష్యాలో పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మిక శక్తి కొరత ఏర్పడింది. దీన్ని అధిగమించేందుకు ఆ దేశం భారత్‌పై ఫోకస్ పెట్టింది. 2025 చివరి నాటికి 10 లక్షల మంది నైపుణ్యం కలిగిన భారత కార్మికులకు రష్యా ఉపాధి కల్పించనున్నట్లు సమాచారం. అక్కడ యాకటెరిన్‌బర్గ్‌లో ఓ కొత్త కాన్సులేట్ జనరల్ ప్రారంభం కానుంది. ఇది వలస కార్మికుల అంశాలను పరిశీలించనుంది. ఉరల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ చీఫ్ అంద్రీ బెసెడిన్ ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు. ఇది వలస కార్మికుల అంశాలను పరిశీలించనుంది. ఈ విషయాన్ని ఉరల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ చీఫ్ అంద్రీ బెసెడిన్ ఓ మీడియా సంస్థకు వెల్లడించారు. రష్యాలోని ఉరల్ పర్వతాలకు సమీపంలో యాకటెరిన్‌బర్గ్ ప్రాంతం అనేది భారీ పరిశ్రమలకు నిలయంగా ఉంది. అక్కడ మిలిటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ కూడా ఉంది. అయితే ఈ ఇండస్ట్రీలు ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉన్నట్లు అంద్రీ బెసెడిన్ తెలిపారు. భారత్‌తో పాటు శ్రీలంక, ఉత్తర కొరియా నుంచి కార్మికులను రప్పించేందుకు కూడా రష్యా ప్రయత్నాలు చేస్తోంది. కానీ ఈ ప్రక్రియలో పలు సమస్యలు ఉన్నట్లు భావిస్తోంది. 2024 నుంచి రష్యా పారిశ్రామిక సంస్థల్లో పనిచేసేందుకు భారత్ నుంచి వలస వలస కార్మికులు రావడం మొదలైంది. అయితే రష్యా కార్మిక శాఖ అంచనాల ప్రకారం చూసుకుంటే 2030 నాటికి ఆ దేశంలో కార్మిక శక్తి కొరత 30 లక్షలకు పైగా ఉండనుంది. అందుకే దీన్ని అధిగమించేందుకు విదేశీ కార్మికులకు ఆఫర్ ప్రకటించింది.

# బీసీ బిల్లును కేంద్రం ఎందుకు ఆమోదించడం లేదు




హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ గాంధీభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చాక బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం చర్యలు చేపట్టామని తెలిపారు. కోర్టు ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని కుల గణన కూడా నిర్వహించామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను బీజేపీ నేతలు వ్యతిరేకిస్తున్నారా.. , బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఎందుకు ఆమోదించడం లేదు అని మంత్రి ప్రశ్నించారు. కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించాల్సిన బాధ్యత బీజేపీ, బీఆర్ఎస్ నేతలపై ఉందని తెలిపారు. రాష్ట్రపతితో ఆమోదింపజేసి.. 9వ షెడ్యూల్ లో చేర్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీ.. ఒక బీసీ నేతను రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించి కిషన్ రెడ్డికి ఇచ్చిందని మంత్రి పొన్నం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రివర్గం లేదా అఖిలపక్షం ఢిల్లీకి వచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు.బీఆర్ఎస్, బీజేపీలో ఉన్న బీసీ నేతలు వాళ్ల అధిష్ఠానంపై ఒత్తిడి పెంచాలని పొన్నం పిలుపునిచ్చారు. బీసీల రిజర్వేషన్లకు అడ్డుపడే పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. రిజర్వేషన్లను త్వరగా అమలు చేసేందుకే ఆర్డినెన్సు తెస్తున్నామని వెల్లడించారు. బీసీల రిజర్వేషన్లపై బీజేపీ నేతలు మొసలికన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో కుల గణన చూపిన తర్వాతే కేంద్రం కళ్లు తెరిచిందని చెప్పిన మంత్రి పొన్నం తెలంగాణ తెచ్చిన ఒత్తిడితోనే కేంద్రం జనగణనతో పాటు కుల గణన చేస్తామని ప్రకటించిందన్నారు. బీసీ నేతలు.. పార్టీ పదవుల కోసం బీసీ రిజర్వేషన్లను తాకట్టుపెట్టొద్దని కోరారు. బీజేపీలోని కేంద్రమంత్రులు, ఎంపీలు బీసీ రిజర్వేషన్ల కోసం కృషి చేయాలన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ నేత లక్ష్మణ్ అసహనంతో మాట్లాడుతున్నారు.. బీజేపీ చేయలేని పని కాంగ్రెస్ చేస్తోందని అక్కసుతో మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కోసం 50 శాతం కోటాను కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో ఎత్తివేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)
Editor: ***PITTALA RAMAKRISHNA***, Cell: 9396218955